మనోజ్ మిట్ట

హెచ్.ఎస్. ఫుల్కా



# 1984 దిల్లీ గుజరాత్ 2002

## వ్యవస్థల వైఫల్యంపై పంచనామా

# దిల్లీ నుండి గుజరాత్ వరకు...

## వ్యవస్థల వైఫల్యంపై పంచనామా

మనోజ్ మిట్ట & హెచ్.ఎస్. ఫూల్కా

తెలుగు : ప్రభాకర్ మందార, రివేరా

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

ధర : రూ. 250/-

మొదటి ముద్రణ : సెప్టెంబర్ 2015

ఆంగ్లమూలం : When A Tree Shook Delhi, The 1984 Carnage and its Aftermath by Manoj Mitta and H.S. Phoolka,
Lotus Collection, Roli Books, New Delhi,
© Manoj Mitta and H.S. Phoolka
The Fiction of Fact-finding: Modi and Godhra,
HarperCollins Publishers India, 2014
© Manoj Mitta 2014

ప్రతులకు, వివరాలకు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్,
ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్,
గుడిమల్కాపూర్, హైదరాబాద్ - 500 006
ఫోన్ : 040 23521849
www.hyderabadbooktrust.blogspot.com

---

ముద్రణ : అనుపమ ప్రింటర్స్,
గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్, హైదరాబాద్ - 28
ఫోన్ : 23391364

# విషయసూచిక

## దిల్లీ 1984 (తెలుగు అనువాదం: ప్రభాకర మందార)


**దిల్లీ నుండి గుజరాత్ వరకు ముందుమాట** 9

**ది ఫిక్షన్ ఆఫ్ ఫాక్ట్ ఫైండింగ్‌కి ముందుమాట** 14

**దిల్లీ 1984 ముందుమాట** 22

**మనోజ్ మిట్ట కథనం**

1. న్యూ దిల్లీ నుంచి 26
2. దుశ్శకునాలు 30
3. సిక్కులను నిరాయుధుల్ని చేసే ఎత్తుగడలు 45
4. 32వ బ్లాకు 50
5. ఒక యుద్ధ వీరుడి అగచాట్లు 58
6. రెండు గురుద్వారాల కథ 64
7. ఉద్దేశపూర్వక స్తబ్దత 73
8. సంతాప సమయంలో అత్యాచారం 81
9. సైన్యం నీడలోనే 88
10. నకిలీ వీరుడు 96

**హెచ్.ఎస్. ఫూల్కా కథనం**

11. వ్యక్తిగత పతనం 102
12. పోరాటం ప్రారంభం 113
13. మంచిని, చెడుతో కలపడం 122
14. విచారణా తంతు 129
15. విచారణ నుంచి తప్పుకోవడం 140
16. మరింతగా మభ్యపెట్టడం 150
17. మలుపు 158
18. తీవ్ర సంఘర్షణలు 166
19. నాయకుల అపసోపాలు 176
20. మరో కొత్త విచారణా కమిషన్ 187
21. ఆలస్యమైన ప్రభావం 195
22. కాస్తంత కరుణ 200
23. చివరిమాట 204

## గుజరాత్ 2002 (తెలుగు అనువాదం: రివేరా)


| | | |
|---|---|---|
| 1. | క్షతగాత్రా.. గోధ్రా! | 208 |
| 2. | దరి తెలియని 'రాజ ధర్మం'! | 229 |
| 3. | 'సమ న్యాయం'లోని అసమ కోణం! | 251 |
| 4 | కళ్లకు కదుతున్నా..! | 278 |
| 5. | మోడీ విచారణ - ముడిపడని ప్రశ్నలు! | 297 |
| 6. | మృతదేహాల తరలింపు- వాస్తవాల మళ్లింపు! | 319 |
| 7. | తప్పుల కుప్పే తీర్పులు చెప్పే! | 336 |
| 8. | నిజ 'నిద్రా' రణ తీరిది! | 361 |
| 9. | బరి తెగించిన హంతక క్రౌర్యం | 382 |
| 10. | వివక్ష విషగాథ! | 404 |
| 11. | ముగింపు | 431 |
| 12. | అనుబంధం | 433 |

# దిల్లీ నుండి గుజరాత్ వరకు ముందుమాట

దిల్లీలో 1984లో, గుజరాత్‌లో 2002లో జరిగిన మారణహోమాలపై పుస్తకాలు రాయడం పూర్తయిన తరువాత ఎప్పుడో చనిపోయిన మా తాతయ్య ఎర్రం సత్యనారాయణకు సంబంధించిన రెండు ఉత్తరాలు లభించాయి. అందులో 'సంప్రదాయిక్తా విరోధి కమిటీ' హైదరాబాద్ విభాగం నిర్వహిస్తున్న ఒక బహిరంగ సభలో మాట్లాడవలసిందిగా కోరుతూ 15 నవంబర్ 1968న అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీకి రాసిన లేఖ ఒకటి. అంతకు కొన్నాళ్ల క్రితమే మా తాతయ్య కన్వీనర్‌గా హైదరాబాద్‌లో జాతీయ సంప్రదాయిక్తా విరోధి కమిటీ విభాగం ఏర్పాటయింది. కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం, పలుకుబడి వల్ల ఆయన కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఇక రెండోది ఇందిరాగాంధీ వ్యక్తిగత కార్యదర్శి ఎన్.కె.శేషన్ 1969 జనవరిలో తీవ్రమైన పనుల ఒత్తిడి కారణంగా ఆ సమావేశానికి ఇందిరాగాంధీ హాజరు కాలేరని 18 నవంబర్ 1968న మా తాతయ్యకు రాసిన లేఖ.

వివిధ మతోన్మాద హింసాకాండలపై నిజ నిర్ధారణ నివేదికలను వెలువరించిన సంప్రదాయిక విరోధి కమిటీకి అంతర్జాతీయంగా ఎంతో మంచి పేరుండేది. పాల్ బ్రాస్ వంటి విశ్వవిఖ్యాత రచయితలు ఆ కమిటీ గురించి ప్రస్తావించేవారు. మా తాతయ్యకు ఇందిరా గాంధీకి మధ్య సద్భావనతో జరిగిన ఆ ఉత్తర ప్రత్యుత్తరాలలో పెద్ద విశేషం ఏమీ లేదు. కానీ, ఇందిరా గాంధీ హత్యానంతరం 1984లో చోటు చేసుకున్న హత్యాకాండపై చేసిన నా పరిశోధనలో సాక్షాత్తూ ఆమె కుమారుడైన రాజీవ్ గాంధీయే కేంద్ర బిందువుగా వుండటం మాత్రం నన్ను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ అనూహ్య పరిణామాలను చూడకుండానే మా తాతయ్య నా తొమ్మిదో ఏట 1973లోనే కాలం చేశారు. మలక్ పేట్‌లోని వారి ఇంట్లోనే నేను పెరిగినప్పటికీ మత హింసపై ఆయనతో చర్చించే అవకాశం రాలేదు. కానీ, విభిన్న సంస్కృతుల సమ్మేళనం లాంటి ఆ ఇంటి వాతావరణాన్ని పిన్న వయసులోనే చవిచూశాను. మా తాతయ్య ఎర్రం సత్యనారాయణ ఎంతో భక్తిభావన వున్న హిందువు. ప్రతి శనివారం స్థానిక ఆంజనేయ స్వామి గుడికి క్రమం తప్పకుండా వెళ్తూ దేవుని ప్రసాదం తీసుకొచ్చేవారు. అయితే తన సమకాలీన

వ్యక్తులులాగా ఆయన ఎంతో మంది ముస్లింలతో ఆత్మీయమైన సామాజిక సంబంధాలను కలిగివుండేవారు. తను స్వయంగా షేర్వాణి ధరించేవారు. ఉర్దూ పత్రికలను చదివేవారు. ఆయనలోని ఈ బహుళత్వ భావనకు ఎప్పుడూ ఎలాంటి పరీక్ష ఎదురుకాలేదు. ఒక్క 1948లో చెలరేగిన రజాకార్ల ఆగడాలు, ఆనాటి పోలీసు చర్య సందర్భంలో తప్ప. ఆ తరువాత మూడు దశాబ్దాల పాటు హైదరాబాద్ ఎలాంటి మతపరమైన హింసాకాండలు లేకుండా ప్రశాంతంగా వుంది.

1978లో నల్లకుంట పోలీసులు రమీజాబీపై అత్యాచారంచేసి, ఆమె భర్తను కొట్టి చంపిన సందర్భంగా రాజుకున్న గొడవలతో నాకు తొలిసారిగా మత హింస అంటే ఏమిటో తెలిసింది. మర్రి చెన్నారెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల చర్యకు వత్తాసు పలుకుతూ రమీజాబీని వేశ్యగా చిత్రించింది. ఆమె రోడ్డు మీద విటుల కోసం ఎదురుచూసేదని ప్రచారం చేసింది. అంతవరకు ప్రభుత్వ ఆస్తులను లక్ష్యం చేసుకుని సాగుతున్న విధ్వంసకాండ ఆ తరువాత మత హింసగా మారింది. ఆ తరువాత జస్టిస్ ముక్తదర్ కమిషన్ పోలీసుల వాదనను ఎంత ఎండగట్టినా 1978నాటి హింసాకాండ హైదరాబాద్ అంతటికీ మరీ ముఖ్యంగా పెద్ద ఎత్తున పాత బస్తీకి విస్తరించింది. మేముండే మలక్‌పేట పాత బస్తీకి దగ్గర కాబట్టి అది తీవ్రస్థాయిలో మత హింస చెలరేగిన ప్రాంతాల్లో ఒకటిగా మారింది. తొమ్మిదవ తరగతి నుంచి పన్నెండవ తరగతి వరకూ నా చదువు ఈ గొడవలతో తరచూ కుంటుపడుతుండేది. మా ఇరుగు పొరుగు ప్రాంతాలు తరచూ కర్ఫ్యూ నీడలో బిక్కుబిక్కుమంటుండేవి. హైదరాబాద్‌లో చదువుకుంటున్న రోజుల్లో 1984 ఆగస్ట్‌లో నేను చిట్టచివరి మత హింసాకాండను చూశాను. అత్యంత దారుణంగా జరిగిన మతోన్మాద హింసాకాండల్లో అదొకటి అని చెప్పవచ్చు. అప్పుడు మొత్తం 40 మంది బలయ్యారు. అయితే, ఆ తరువాత కొద్ది నెలలకే దిల్లీలో చోటు చేసుకున్న దారుణ మారణకాండలో అధికారిక లెక్కల ప్రకారం 2,733 మంది బలైనట్టు తేలింది. హైదరాబాద్‌లోనే కాదు దేశంలోని మరే ఇతర ప్రాంతంలోనూ ఆ స్థాయిలో మతోన్మాద హింసకు చెలరేగిన దాఖలాలు లేవు.

దిల్లీలో జరిగిన మారణహోమం భారత దేశ చరిత్రనే ఒక మలుపు తిప్పింది. ఆ వెంటనే వచ్చిన లోక్‌సభ ఎన్నికలలో సిక్కు వ్యతిరేక ఉన్మాదాన్ని ఉపయోగించుకుని రాజీవ్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ అనూహ్యమైన విజయాన్ని సొంతం చేసుకుంది. 1984 నాటి రక్తపాతంపై విచారణ జరిపిన మిశ్రా కమిషన్ చాలా అవకతవకగా వ్యవహరించింది. దానికి తోడు రాజీవ్ గాంధీ ప్రభుత్వం బాబ్రీ మసీదు ప్రాంగణంలో రామజన్మభూమి గుడికి తలుపులు తెరిచి మతోన్మాదులకు మరింత శక్తిని సమకూర్చింది.

షాబానో సమస్యపై ముస్లిలను సంతృప్తిపరిచేందుకు తీసుకున్న నిర్ణయానికి ప్రతిగా రామజన్మభూమి గుడికి తెరలేపినట్టు అనిపించినా ఆ చర్య హిందూ జాతీయవాదానికి అసలు ప్రతినిధిగా భావించబడే భారతీయ జనతా పార్టీకి ఒక వరంగా మారింది. ఈ విధంగా మతపరంగా వేడెక్కి వున్న వాతావరణం మధ్య దిల్లీలో పత్రికా రచయితగా నా జీవితం ప్రారంభమయింది. నేను సహజంగానే 1984 నాటి హింసాకాండ బాధితులకు న్యాయం చేకూర్చాలన్న లక్ష్యానికి అంకితమయ్యాను. హైదరాబాద్‌లో బాల్యం నుంచే నాలో లౌకికవాదం పట్ల ఏర్పడిన అభిమానమే ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనకాడకుండా ముందుకు సాగేందుకు దోహదం చేసిందని నేను భావిస్తున్నాను. బాధితులకు జరిగిన అన్యాయం తీవ్రమైనదైనా మారిన ఆనాటి పరిస్థితుల మధ్య ప్రధాన మీడియాలో ఆ అంశానికి స్థానం కల్పించేట్టు చేయడం అంత సులువైనదేం కాదు.

1984 బాధితులకు న్యాయం కోసం నడుం బిగించిన న్యాయవాది హెచ్.ఎస్. ఫూల్కాతో నేను కలసి పనిచేయడం వల్లనే ఈ వ్యవస్థ రాజకీయ నేరగాళ్లకు, అక్రమార్కులైన పోలీసు అధికార్లకు ఎలా కొమ్ము కాస్తోందో అర్థం చేసుకునేందుకూ, వారిపై పట్టుదలగా పోరాటం కొనసాగించేందుకు నాకు వీలయింది. ఫూల్కా, నేనూ కలసికట్టుగా చేసిన కృషి ఫలితమే “వెన్ ఎ ట్రీ షుక్ దిల్లీ: ద 1984 కార్నేజ్ అండ్ ఇట్స్ ఆఫ్టర్‌మాత్” పుస్తకం. బహుశా ఈ సమస్యపై మొట్టమొదట వెలువడిన సమగ్ర గ్రంధం ఇదే. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశ రాజధానిలో జరిగిన దారుణమైన మారణహోమంపై ఈ పుస్తకం రావడానికి దాదాపు 23 సంవత్సరాల సుదీర్ఘ కాలం పట్టింది. 2007లో వెలువడిన ఈ పుస్తకం భారతదేశ న్యాయ వ్యవస్థ, పరిపాలనా వ్యవస్థలోని లోటుపాట్లను వెలుగులోకి తెచ్చేందుకు ఎంతో దోహదం చేసింది. ఆ మధ్యకాలంలో 1984 హింసాకాండపై అనేక విచారణలు జరిగినప్పటికీ కీలకమైన పత్రాలు మాత్రం కేవలం 2000 సంవత్సరం తరువాతనే బయటికి వచ్చాయి. అటల్ బిహారీ వాజ్‌పాయి ప్రభుత్వం పుణ్యమాని నాటి మారణహోమంపై తాజాగా మరో న్యాయ విచారణ కమిటీని నియమిస్తూ ఆదేశాలు జారీ అయిన తరువాతనే, అంత ఆలస్యంగానైనా ఆ పత్రాలు బయటపడ్డాయి.

1984 మారణ హోమంపై ఈ పుస్తకం వెలువడటంలో జాప్యం జరిగినా సమస్య ప్రాసంగికత మాత్రం ఇప్పటికీ తగ్గినట్టు అనిపించలేదు. దేశ విదేశాల్లోని నూతన తరానికి చెందినవాళ్లు ముఖ్యంగా సిక్కులు మా అంచనాలకు మించి ఈ పుస్తకాన్ని ఆదరించారు. ఇందులో వివరించిన విషయాలపట్ల ఎంతో ఆసక్తిని కనబరిచారు. 1984 మారణ హోమానికి ప్రధాన బాధ్యులైన రాజీవ్‌గాంధీతో పాటు ఆనాడు హోంమంత్రిగా వున్న

పి.వి.నరసింహారావు, అలాగే అత్యంత దారుణంగా హింసాకాండ జరిగిన తూర్పు దిల్లీ నియోజకవర్గానికి పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించిన హెచ్.కె.ఎల్. భగత్ మొదలైన ముఖ్య నేతలంతా అప్పటికే చనిపోయినప్పటికీ ఈ పుస్తకానికి అంత ఆదరణ లభించడం నిజంగా విశేషమే. ఒకపక్క ఈ పుస్తకంపై శల్యపరీక్షలు చేసే సమీక్షలు వెలువడుతుండగానే నాకు బ్రిటన్, కెనడా పార్లమెంటుల్లో, అమెరికా కాంగ్రెస్‌లో దీనిపై మాట్లాడే అవకాశం లభించింది. ఇటీవలి గుజరాత్ 2002 జాతి హత్యాకాండపై నా తదుపరి పుస్తక రచనకు ఇది ఎంతో ఆత్మవిశ్వాసాన్ని, స్ఫూర్తిని ప్రసాదించింది.

1984 హింసాకాండ ప్రధాన నిందితుడిలా కాకుండా గుజరాత్ హింసాకాండలో ప్రధాన నిందితుడైన నరేంద్ర మోదీ జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగే క్రమంలో వుండటం వల్ల “ది ఫిక్షన్ ఆఫ్ ఫాక్ట్-ఫైండింగ్: మోది అండ్ గోద్రా” పుస్తక రచన మాకు ఒక పెద్ద సవాలుగా మారింది. హిందుత్వకు అంకితమైన ప్రభుత్వం కనుసన్నల్లో సాగిన తొలి భారీ మతతత్వ హింస విషయంలో అనుసరించిన పద్ధతిపైనే ఆయన నాటకీయ ఎదుగుదల ఆధారపడివుంది. గుజరాత్ పుస్తక రచనలో ఇతరత్రా ఎన్ని అడ్డంకులు ఎదురైనా 1984 దిల్లీ పుస్తకంతో పోలిస్తే మాత్రం అధికారిక నిజనిర్ధారణా పత్రాలు అప్పటికంటే చాలా సులువుగా లభించాయి. అందువల్లనే దీనిని వెలువరించేందుకు వీలయింది. కొన్ని కేసులలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని వాటిపై గుజరాత్ వెలుపల విచారణ జరపాలని ఆదేశించడం, మరికొన్ని కేసుల సత్వర విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (ఎస్ఐటి)ను నియమించడం వల్లనే అధికారిక పత్రాలు సులువుగా లభించేందుకు వీలయింది. జవాబుదారీ తనం కోణంలోంచి చూస్తే బాధితుల్లో ఒకరైన జాకియా జాఫ్రీ ఆనాటి గుజరాత్ మారణహోమానికి పథక రచన చేసింది నరేంద్ర మోదీ, ఆయన ప్రభుత్వంలోని ఇతర నేతలే అని ఆరోపిస్తూ దాఖలు చేసిన ఫిర్యాదే అత్యంత కీలకమైనది. ఇంతటి సమగ్రమైన సమాచారం అందుబాటులో వున్నప్పటికీ మోదీ జవాబుదారీ తనాన్ని నిరూపిస్తూ, అధికారిక నిజనిర్ధారణలోని లొసుగులను బట్టబయలు చేస్తూ వెలువడిన పుస్తకం కేవలం ఇదొక్కటి మాత్రమే.

ప్రత్యేక దర్యాప్తు సంస్థ మోదీకి క్లీన్ చిట్ ఇవ్వడాన్ని అహ్మదాబాద్‌లోని ఒక మెజిస్ట్రేట్ 2013 డిసెంబర్‌లో సమర్థించారు. దాంతో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ పుస్తకాన్ని నేను 2014 ఫిబ్రవరిలోనే వెలువరించాను. ఇలాంటి పుస్తకం రాయడానికి ఎంతో సాహసం కావాలని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ముఖ్యంగా మోదీపై చిన్న విమర్శ చేసినా ఆయన భక్తులు సంఘటితంగా విరుచుకుపడుతున్న వాతావరణంలో మరీ కష్టం. అంతకు ముందు 1984 దిల్లీ మారణహోమం విషయంలో ఇలాగే మానవ

హక్కుల కోసం పుస్తకం వెలువరించి వుండటం, విధిగా అధికారిక పత్రాలపై, వాస్తవాలపై ఆధారపడే విమర్శలను కొనసాగించివుండటం మూలంగానే నేను విషమ పరీక్షలను తట్టుకుని నిలబడగలిగాను. గుజరాత్ పుస్తకానికి కూడా విస్తృతమైన ప్రశంసలు లభించాయి. ప్రత్యేకించి హింసాకాండలో వ్యవస్థీకృత ప్రమేయం, నేరాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నాలు జరగడం పట్ల ఆందోళన చెందేవారినుంచి ఎక్కువ ప్రశంసలు వచ్చాయి. అలాంటి వాటిలో హైదరాబాద్ బుక్ ట్రస్ట్‌కు చెందిన గీతా రామస్వామి నుంచి అనూహ్యంగా వచ్చిన ఆత్మీయ ప్రతిస్పందన ఒకటి. నా మాతృ భాష అయిన తెలుగులో ఈ పుస్తకాలను ప్రచురించాలనుకుంటున్నట్టు ఆమె ప్రతిపాదించారు.

ఈవిధంగా గీతా రామస్వామి చొరవ వల్లనే ఈ రెండు పుస్తకాల సంపుటి ఇవాళ మీ చేతుల్లో వుంది. వృత్తిపరంగా, ఇతరత్రా వివిధ ఇబ్బందులు రావచ్చని తెలిసి కూడా ఈ ప్రచురణను చేపట్టినందుకు ఆమెకు నేను హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఎంతో నిబద్ధతతో ఆమె పూనుకోక పోయినట్టయితే ఈ పుస్తకాలు తెలుగులో వెలువడేందుకు ఆస్కారమే వుండేది కాదు. అదేవిధంగా అడిగిన వెంటనే అనువాదానికి ఆమోదం తెలియజేసిన ఇంగ్లీషు పుస్తక ప్రచురణ కర్తలు "రోలీ బుక్స్", "హార్పర్ కాలిన్స్" వారికి కృతజ్ఞతలు. "వెన్ ఎ ట్రీ షుక్ దిల్లీ: ది 1984 కార్నేజ్ అండ్ ఇట్స్ ఆఫ్టర్‌మాత్"ను "ది ఫిక్షన్ ఆఫ్ ఫాక్ట్-ఫైండింగ్: మోదీ అండ్ గోద్రా"ను సరళమైన తెలుగులోకి తర్జుమా చేసిన హైదరాబాద్ బుక్ ట్రస్ట్ అనువాదకులు ప్రభాకర్ మందారకు, రివేరాకు నా కృతజ్ఞతాభినందనలు. వీరందరి సమిష్టి కృషి ఫలితం తెలుగు పాఠకులను తప్పక ఆకట్టుకుంటుందని ఆశిస్తున్నాను.

**- మనోజ్ మిట్ట**

న్యూ దిల్లీ
04-08-2015

# ది ఫిక్షన్ ఆఫ్ ఫాక్ట్ ఫైండింగ్‌కి ముందుమాట

అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వానికి లొంగిపోయిన చరిత్రే ఉంది. ఒత్తిళ్లకు వొదిగిపోవడం తప్ప శిరసు ఎత్తి నిలిచిన దాఖలా కనిపించదు. తాలిబన్ల బెదిరింపులకు లొంగిపోయి 1999లో అఫ్ఘానిస్థాన్‌లో.... వారు అపహరించిన పౌర విమానం, అందులోని ప్రయాణికులకు ప్రతిగా ముగ్గురు ఉగ్రవాదులను వాజ్‌పేయి ప్రభుత్వం అప్పగించింది. ఎవరికీ గుర్తులేని విషయం ఏమిటంటే, ఆ తరువాత రెండేళ్లకే మరో అతివాద భావజాలం ఎదుట ఆయన ప్రభుత్వం సాగిలపడింది. ఈసారి స్వదేశీ హిందుత్వకు దాసోహం అంది. శ్రీరాముడు జన్మించినట్టు విశ్వసిస్తున్న అయోధ్యలోని వివాదాస్పద స్థలంలో విశ్వహిందూ పరిషత్.. మరో రెండు రోజుల్లో తలపెట్టిన ప్రతీకాత్మక పూజకు అనుమతి ఇవ్వాలని 2002 మార్చి 13వ తేదీన సుప్రీంకోర్టును వాజ్‌పేయి సర్కారు కోరింది. అప్పటికి పరిస్థితులు అతి సున్నితంగా ఉన్నాయి. ప్రభుత్వం కోర్టుకు వెళ్లేనాటికి, 15 రోజుల ముందే గోధ్రాలో రైల్వే స్టేషన్‌లో జరిగిన గొడవ తీవ్ర రూపం తీసుకొన్న విషాదంలో 59 మంది రైలు ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. ఆ వెంటనే వీహెచ్‌పీ శ్రేణులు మత కల్లోలాలకు తెరతీశాయి. ఈ మారణహోమంలో వెయ్యిమందికి పైగా ఊచకోతలకు గురయ్యారు. దాడులు, హత్యలకు గురయినవారిలో ఎక్కువమంది ముస్లింలే ఉన్నారు.

ఇంత జరిగినా అయోధ్య రామ మందిర నిర్మాణ క్యాంపెయిన్ విషయంలో వీహెచ్‌పీ వైఖరిలో కించిత్తు మార్పు లేదు. అయోధ్యపై తన ప్రచార సరళి వల్లనే గోధ్రా విషాదం జరిగింది. అయినా, ఆ సంస్థ తన కరుకైన వ్యవహార ధోరణిని ఎక్కడా సడలించలేదు. యథాతథంగా మార్చి 15వ తేదీనే రామమందిర నిర్మాణానికి శ్రీకారం చుడతామని వీహెచ్‌పీ ప్రకటించింది. ఆ మేరకు వాజ్‌పేయి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో సఫలం అయింది. ఆ రోజు వీహెచ్‌పీ తలపెట్టిన కార్యక్రమాలకు అనుమతి ఇవ్వాలంటూ ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ సోలి సొరాబ్జీ.. సుప్రీంకోర్టులో వాదించారు.

చీఫ్ జస్టిస్ బీఎన్ కిర్పాల్ నేతృత్వంలోని బెంచ్, వీహెచ్‌పీ మాటలను విశ్వాసంలోకి తీసుకోలేదు. ఆ రోజున కేవలం ప్రతీకాత్మక పూజకు మాత్రమే తాము పరిమితం అవుతామన్న ఆ సంస్థ నేతల హామీని తోసిపుచ్చింది. గోధ్రా అనంతర హింసాకాండలో

ఈ సంస్థకు నేర భాగస్వామ్యం ఉన్నదన్న ఒకే ఒక్క కారణంగానే కోర్టు ఇలాంటి వైఖరిని తీసుకోలేదు. గతంలో ఇలాగే ప్రతీకాత్మక క్రతువును అయోధ్యలో నిర్వహించుకొంటామంటే కోర్టు విశ్వసించింది. చివరకు అది.. బాబ్రీ మసీదు విధ్వంసానికి దారి తీసింది. దేశ విభజన తరువాత ఆ స్థాయిలో భారతదేశంలో లౌకికవాదాన్ని ప్రమాదంలో పడేసిన ఉదంతం అది. అందువల్లనే 'డిసెంబర్ 6 ని పునరావృతం కానీయదలుచుకోలేదు' అని బెంచ్ తేల్చి చెప్పింది. ప్రతీకాత్మక పూజ వెనుక దాగిన పన్నాగాన్ని పసిగట్టగలిగింది.

కోర్టు నిర్ణయం వెలువడిన కొన్ని గంటల్లోనే వీహెచ్‌పీ అధినేత అశోక్ సింఘాల్ మీడియా ముందుకు వచ్చారు. కోర్టు తీర్పు నిజానికి తమకే అనుకూలంగా ఉన్నదని అయోధ్యలో సింఘాల్ వ్యాఖ్యానించారు. మార్చి 13, 2002న వెలువరించిన తీర్పులో జరిగిన పొరపాటే సింఘాల్‌లో విజయగర్వానికి కారణం అయింది. అదేగనుక మరునాడే ఆ పొరపాటును కోర్టు సరిచేయకపోయినట్టయితే, దేశమంతటా వీహెచ్‌పీ మత ఉద్రిక్తతలను పెంచగలిగి ఉండేది.

ఇంజంక్షన్ ఆదేశాల ద్వారా యథాతథ స్థితి కొనసాగుతున్న ప్రభుత్వ స్వాధీనంలోని 67 ఎకరాల స్థలాన్ని నిర్వచించే విషయంలో కోర్టు పొరబడింది. స్వాధీనం సమయంలో ఈ స్థలాన్నంతా 100 రెవెన్యూ ప్లాట్లుగా విభజించారు. అయితే, రెండు రెవెన్యూ ప్లాట్ల పరిధిలోనే యథాతథ స్థితి కొనసాగుతున్నదని కోర్టు పేర్కొంది. సరిగ్గా ఈ అంశాన్నే వీహెచ్‌పీ పట్టుకొంది. వివాదాస్పద ప్రాంతంలోని ప్రభుత్వ ఆధీనంలోని భూమిలో తాము తలపెట్టిన పూజకు చట్టబద్ధత ఉన్నదని అది వాదించేందుకు వీలు చిక్కింది. కోర్టు విచారణ క్రమంపై నేను 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో ఒక కథనం ప్రచురించాను. పొరపాటు ఎక్కడ జరిగింది, ఆ తప్పు తీర్పు పాఠంలోకి ఎలా చేరిందనేది రాశాను. ఆ మరునాడే చీఫ్ జస్టిస్ కిర్పాల్ నా కథనాన్ని చదివారు. అదే రోజు షెడ్యూల్‌లో లేకపోయినా ఆయన నేతృత్వంలోని బెంచ్ ఈ అంశంపై విచారణను కొనసాగించి..తీర్పులోని అస్పష్టతని సరిచేసింది. సకాలంలో జరిపిన సవరణతో వీహెచ్‌పీ తలపెట్టిన పూజా కార్యక్రమానికి దెబ్బ తగిలింది. ఈ రాజకీయ– న్యాయ రసవత్తర నాటకానికి తెర దించడంలో ఉత్ప్రేకరంగా పనిచేసిన నా కథనాన్ని అప్పట్లో వెలువడిన అనేక కథనాలు ప్రస్తావించాయి. 'ఫ్రంట్‌లైన్'లో 2002 మార్చి 30వ తేదీన న్యాయ కోవిదుడు ఏజీ నూరానీ ఒక వ్యాసం రాశారు. "ప్రభుత్వ స్వాధీనంలోని 67.03 ఎకరాల స్థలాన్ని నిర్వహించడంలో పొరపాటున జరిగిన తప్పును లేవనెత్తిన ఘనత పూర్తిగా మనోజ్ మిట్టకే దక్కుతుంది. దాని ఆధారంగా మార్చి 14వ తేదీన కోర్టు స్పష్టతనిచ్చింది" అని ఆ వ్యాసంలో నూరానీ విశ్లేషించారు.

నా గొప్పను ప్రదర్శించుకోవడానికి నేను ఇదంతా గుర్తు చేయడం లేదు. కాకపోతే ఒక పాత్రికేయునిగా గత ముప్పై ఏళ్లుగా న్యాయ వ్యవస్థకు దగ్గరగా మసలుతున్నాను.

ఇన్నాళ్ల అనుభవంలో, న్యాయ వ్యవహారాల్లోని పొరపాట్లను బయటపెట్టేందుకే నేను ప్రాధాన్యతనిస్తాను. చివరకు అది అత్యున్నత న్యాయ వ్యవస్థ అయిన సుప్రీంకోర్టు అయినా, ఈ విషయంలో మినహాయించలేదు. అయోధ్యలో ప్రభుత్వ స్వాధీనంలోని భూమి అంశం ఒక అరుదైన ఉదంతం. జరిగిన తప్పును వెంటనే గుర్తించి సరిచేశారు. పైగా, నూరానీ అన్నట్టు అది ఏదో ఏమరపాటున జరిగిన తప్పు. కానీ, చాలా సందర్భాల్లో ఏమి జరుగుతుందంటే, కావాలని చేసిన తప్పును అంగీకరించేందుకూ వ్యవస్థలు సుముఖంగా ఉండటం లేదు.

గుజరాత్ మారణహోమంపై సాగిన నిజ నిర్ధారణ ప్రక్రియలోని తప్పులను ఈ పుస్తకం వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ నిజ నిర్ధారణ క్రమం అనేది అయోధ్య వివాదంపై జరిగిన తంతుకు సిసలైన కొనసాగింపు! నిజ నిర్ధారణ తీరును బయటపెట్టే సమాచారం కోసం మారణహోమంపై విచారణకు నియమించిన కమిషన్లు, కమిటీల నివేదికల మీదనే నేను ఆధారపడలేదు. దర్యాప్తు సంస్థల నివేదికలు, కోర్టు తీర్పులు, ఉత్తర్వులను సైతం సంపాదించి పరిశీలించాను. గోధ్రా అనంతర హింసలో రాజకీయ, ప్రభుత్వ యంత్రాంగ నేర భాగస్వామ్యాన్ని తెలిపే వాస్తవాలు కొల్లలుగా కళ్ల ముందే ఉన్నాయి. అయినా వాటిని కప్పిపెట్టేసేలా, తీవ్రమైన తప్పులు నిజ నిర్ధారణలో చోటుచేసుకొన్నాయి. అంశాల గుర్తింపు, వాస్తవాల ఎంపిక, సాక్ష్యాల నమోదు లేక అనుమానితులపై అంచనా విషయంలో కపటత్వం తొంగిచూసింది. దాంతో వాస్తవాలు వక్రీకరణకు గురయ్యాయి.

మనదేశంలో అస్థిర పునాదిపై సాగుతున్న నిజ నిర్ధారణ ప్రక్రియపై నేను రాసిన రెండో పుస్తకం ఇది. దీనినీ మత మారణహోమాల సంబంధంగానే రచించాను. తొలి పుస్తకాన్ని 1984 దిల్లీ సిక్కు వ్యతిరేక ఊచకోతలపై వెలువరించాను. గుజరాత్‌లో 2002లో జరిగిన హింసకు ఒక మైలురాయి వంటి పోలికగా దిల్లీ సిక్కు వ్యతిరేక ఊచకోతలను పేర్కొంటారు. నిజ నిర్ధారణ ముసుగులో, వాస్తవాలను సమాధి చేసేందుకు జరిగిన ప్రయత్నాలపై ఈ రెండు పుస్తకాలు సూటిగా దృష్టి సారించాయి. ఇలాంటి తంతు వల్ల లాభపడింది రాజీవ్‌గాంధీనా లేక నరేంద్ర మోదీనా.. అనేది లక్ష్యపెట్టలేదు. 'వెన్ ఆ ట్రీ షుక్ దిల్లీ' పేరుతో తొలి పుస్తకం 2007లో విడుదల అయింది. "గుజరాత్ మత మారణహోమం... స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలోనే తొలి పూర్తి స్థాయి రక్తసిక్త కార్యక్రమం" అంటూ మేధావి అషుతోశ్ వర్షనే చేసిన వ్యాఖ్యలకు సమాధానంగా ఈ పుస్తకం. ఎల్‌కే అడ్వాణీ 2008లో వెలువరించిన తన స్వీయ ఆత్మకథలో గుజరాత్‌పై ఒక అధ్యాయం కేటాయించారు. అందులో ఈ పుస్తకం ప్రస్తావన తెచ్చారు. సిక్కు ఊచకోతలు భారీఎత్తున సాగాయని, దాడులు ఏకపక్షంగా కొనసాగాయని, పరమ నిస్సిగ్గుగా వాస్తవాలను కప్పిపెట్టారని ఆయన ఆక్షేపించారు. ప్రస్తుత రచనతో పోల్చితే.. తొలి పుస్తకం తయారీలో

పెద్దగా ఇబ్బంది పడలేదు. సీనియర్ న్యాయవాది హెచ్ఎస్ ఫూల్కా సహ రచయితగా ఉండటమే దీనికి కారణం. సిక్కు బాధితులకు న్యాయం కోసం సాగిన పోరాటానికి ఫూల్కా తిరుగులేని నాయకత్వం అందిస్తున్నారు. ఫూల్కా వంటి వారు తోడు లేకపోవడం వల్ల, ఈ రచనను పూర్తి చేయడానికి ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చింది.

గుజరాత్ సంబంధంగా, వాస్తవాలను సమాధి చేయడంతో ముడిపడిన ఏ చిన్న వివరాన్నైనా ఒడిసిపట్టుకోవడంలో కనీసంగా మూడు వేర్వేరు శ్రేణులకు చెందిన న్యాయవాదులు, కార్యకర్తలు, ప్రజావేగుల సహకారం తీసుకొన్నాను. ఈ పుస్తకంలో వినిపించే గొంతుక నాదే అయినా, అందుకు అవసరమైన అధికార పత్రాలను సరిచూసి, నా రచనను సరిదిద్దే పనికి వీరు ఎంతగానో దోహదం చేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జీటీ నానావతి కమిషన్‌కు సంబంధించిన కీలక సమాచార వనరులను న్యాయవాది ముకుల్ సిన్హా నుంచి పొందాను. గోధ్రా, గోధ్రా అనంతర హింసాకాండ బాధితులకు నానావతి కమిషన్ ఎదుట ఆయన ప్రాతినిథ్యం వహించారు. గోధ్రా రైలు దహనం కేసులో జరిగిన విచారణ గురించి.. ఈ ప్రక్రియలో స్వయంగా పాల్గొన్న కొలిన్ గొంజాల్వెజ్, వాత్సా, ఏఏ హసన్, ఏడీ షాల నుంచి సమాచారం తీసుకొచ్చాను. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో.. జాకియా జాఫ్రీ ఫిర్యాదుపై విచారణ జరిపిన ప్రత్యేక దర్యాప్తు బృందం విషయంలో.. తీస్తా సెతల్వాద్, ప్రజా వేగు ఆర్‌బీ శ్రీకుమార్‌లిచ్చిన విలువైన వివరాలపై ఆధారపడ్డాను. వీరంతా సత్యం కోసం లేక న్యాయం కోసం పోరాడుతున్న మనుషులు. కాకపోతే విచారకరం ఏమిటంటే, వీళ్ల మధ్య సమన్వయం కొరవడింది.

2002 నాటి హింసాకాండపై జరిగిన నిజ నిర్ధారణ గుట్టును బయటపెట్టడంలో మరో ముఖ్యమైన సవాల్‌ను ఎదుర్కోవాల్సి వచ్చింది. అదేమిటంటే, సుప్రీంకోర్టు ప్రత్యేక పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) పనిచేసింది. అంతేకాదు..మత హింసకు సంబంధించిన కేసుల్లో దోషులు శిక్షింపబడరనే అలవాటైన భావన దేశచరిత్రలోనే తొలిసారి భగ్నమైంది. అహ్మదాబాద్‌లోని నరోడా పాటియాలో 96 మందిని ఊచకోతలు కోసిన కేసులో అప్పటి గుజరాత్ సీఎం మోదీ ప్రభుత్వంలోని మంత్రి మాయా కొడ్నానీకి కోర్టు శిక్ష విధించడమే ఇందుకు ప్రబల ఉదాహరణ. సుప్రీంకోర్టు పర్యవేక్షణ వల్లనే ఇదంతా సాధ్యమయింది. అదే సమయంలో, ఇలాంటి పర్యవేక్షిత వాతావరణంలోనే, గోధ్రా అనంతర హింసాకాండకు కుట్ర పన్నారంటూ జాఫ్రీ ఆరోపించిన, మోదీ సహా ప్రాబల్యం గల నేతలందరికీ 'సిట్' క్లీన్‌చిట్ ఇచ్చింది. ఇది ఎలా సాధ్యం అయింది? ఈ ప్రశ్న అంత సాహసంగానే, ఈ పుస్తకమూ తొలిసారి అదేస్థాయిలో సమాధానం వెతికే ప్రయత్నం చేసింది. జాఫ్రీ ఫిర్యాదుకు చివరకు ఏ గతి పట్టించారనేది బయటపెట్టింది. సాక్ష్యాధారాల

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/1984+Delhi+Gujarat+2002**

* * *